క్లుప్తంగా

గణిత బ్రహ్మ లక్కోజుకు ఘన నివాళి



సంజీవరాయశర్మ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు

సామర్లకోట: ప్రపంచంలోనే ఆరువేల గణిత అవధానాలు చేసి అనేక ప్రశంసలు పొందిన గణిత బ్రహ్మ లక్కోజు సంజీవరాయశర్మ పట్టుదల, ఆత్మవిశ్వాసం అనితర సాధ్యమని స్థానిక గణితావధాని తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. స్థానిక బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో హెచ్‌ఎం సాయిరామకృష్ణ అధ్యక్షతన సంజీవ రాయ శర్మ జయంతిని నిర్వహించారు. లక్కోజును నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని, జన్మతః అంధుడైన శర్మ అత్యంత క్లిష్టమైన గణితావధానం ద్వారా నెహ్రూ, డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ వంటి ప్రముఖుల ప్రశంసలు పొందారన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గణిత అవధానంలోని మాయా చదరం, పుట్టిన తేదీకి వారం చెప్పడం, వర్గాల భేదం వంటి అంశాలను ప్రదర్శించి, మెళకువలను బోధించారు. అదే విధంగా గణిత పరంగా 22 సంఖ్య ప్రత్యేకతను వివరించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెచ్‌డీఎఫ్‌సీ సేవా కేంద్రం ప్రారంభం



కామన్ సర్వీసు సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

పిఠాపురం: బ్యాంకుల ద్వారా అందే సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. గొల్లప్రోలు మండలంలోని దుర్గాడలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఏర్పాటు చేసిన కామన్ సర్వీసు సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ కాకి రామకృష్ణ సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

రేపు ఉప్పవారి సత్రం వద్ద కార్తిక వన సమారాధన

సామర్లకోట: స్థానిక ఉప్పువారి సత్రంలో శుక్రవారం కార్తిక వన సమారాధన నిర్వహిస్తున్నట్టు సత్రం వ్యవస్థాపక అధ్యక్షుడు ఉప్పు సత్యనారాయణ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఏటా క్షీరాబ్ధి ద్వాదశి (చిల్కు ద్వాదశి) రోజు అన్న సమారాధన నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా దేవదాయశాఖ అనుమతితో ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు.

27 నుంచి ఎంటీటీలకు శిక్షణ

సామర్లకోట: సచివాలయ కార్యదర్శులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చే నిమిత్తం ఎంపిక చేసిన మాస్టర్ ట్రైనర్ల (ఎంటీటీ)లకు ఈ నెల 27 నుంచి రెండు బ్యాచ్‌లలో శిక్షణ ఇవ్వనున్నట్టు విస్తరణ శిక్షణ కేంద్రం ఎస్టేట్ మేనేజర్ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, తూర్పు, పశ్చిమ, ఏలూరు జిల్లాల్లోని సీనియర్ పంచాయతీ కార్యదర్శులను మాస్టర్ ట్రైనర్లుగా ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నట్లు వెంకటేశ్వర్లు తెలిపారు. 27, 28 తేదీల్లో ఒక బ్యాచ్, 29, 30 తేదీల్లో రెండో బ్యాచ్‌కు శిక్షణ ఉంటుందన్నారు. బ్యాచ్‌కు 120 మంది చొప్పున ఉంటారని, శిక్షణ అనంతరం వారు ఆయా మండలాల్లో డిసెంబర్ 4 నుంచి 13 వరకు సచివాలయ కార్యదర్శుకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు.

వాహన ప్రమాదాలపై ఆటో డ్రైవర్లకు అవగాహన



సామర్లకోటలో ఆటో డ్రైవర్లకు సూచనలిస్తున్న పోలీసులు

సామర్లకోట: పట్టణ పరిధిలో విద్యార్థులను తీసుకువెళ్లే ఆటో డ్రైవర్లకు బుధవారం పోలీసులు అవగాహన కల్పించారు. విశాఖపట్నంలో విద్యార్థులు ప్రయాణిస్తున్న వాహనానికి జరిగిన ఘోర ప్రమాదం నేపథ్యంలో స్థానిక స్టేషన్ సెంటర్‌లో మూడు ఆటో స్టాండ్‌లు, మెహర్ కాంప్లెక్స్‌లోని ఆటో స్టాండ్ డ్రైవర్లకు అవగాహన కల్పించారు. విశాఖలో కేవలం ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని, దీనిని దృష్టిలో ఉంచుకొని ముఖ్య కూడళ్లు దాటే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆటో నడిపే సమయంలో సెల్ ఫోన్ మాట్లాడుతున్నట్లు గమనిస్తే ఆటోలను సీజ్ చేస్తామని, డ్రైవింగ్‌లో తీసుకోవలసిన జాగ్రత్తలపై ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై మూర్తి, హెచ్‌సీ రాజు ఇతర ఇబ్బంది పాల్గొన్నారు.

జగన్‌తోనే సంక్షేమ పాలన సాధ్యం

- ఎమ్మెల్యే దొరబాబు
- భోగాపురంలో వై ఏపీ నీడ్స్ జగన్



భోగాపురంలో ప్రభుత్వ సంక్షేమాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు



అచ్చంపేటలో లబ్ధిదారుల జాబితా బోర్డును ఆవిష్కరించిన దవులూరి దొరబాబు

పిఠాపురం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. భోగాపురంలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సచివాలయం వద్ద అభివృద్ధి సంక్షేమ బోర్డును ఆయన ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండాను ఎగురవేసి ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పథకాలతో ప్రజలకు మేలు

సామర్లకోట: సంక్షేమ, అభివృద్ధి పథకాలతో ప్రజలకు ఎంతో మేలు జరిగిందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్‌లో భాగంగా బుధవారం సామర్లకోట మండలం అచ్చంపేట సచివాలయంలో సర్పంచ్ వీరంరెడ్డి చినబాబు, ఎంపీటీసీ సభ్యుడు వింటి కృష్ణ, మాజీ సర్పంచ్ సలాది రమేష్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సంక్షేమంతోనే అభివృద్ధి అని నిరూపించిన గొప్ప నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. అటువంటి వ్యక్తి జీవితం కాలం ఉండాలని ఇదే విషయాన్ని ఇంటింటా ప్రజలకు వివరించారు. వ్యవసాయాన్ని పండుగగా మార్చి రైతును రాజుగా చేసిన ఘనత సీఎంకే దక్కుతుందన్నారు. ఎన్నికలల్లో నవరత్న పథకాలను హామీలుగా ప్రకటించి వాటిని అమలు చేశారన్నారు. అందరికీ ఇళ్ల పథకంలో హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా తనకు రెండు పర్యాయాలు పదవి దక్కడం ఎంతో ఆనందంగా ఉన్నదన్నారు. ఇదే ఆనందాన్ని ప్రతీ ఒక్కరికి పంచాలనే ఆలోచనతో సీఎం పని చేస్తున్నారని తెలిపారు. రాబోయే ఎన్నికలల్లో 175 స్థానాలలోను విజయ ఢంకా మోగించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పుట్టిన బిడ్డ నుంచి చనిపోయే వారి వరకు అనేక పథకాలు అమలు జరుగుతున్నాయని చెప్పారు. జగన్‌ను ఎదుర్కొనలేక ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తుంటే, ఎల్లో మీడియా సహకరిస్తోందన్నారు. ప్రజలకు మంచి చేసిన జగన్‌ను తిరిగి సీఎంగా ఎన్నుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికల హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిన వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సచివాలయం పరిధిలో లబ్ధిదారుల జాబితా బోర్డును దొరబాబు ఆవిష్కరించి పార్టీ జెండా ఎగురవేసి అనంతరం వలంటీర్లకు కిట్లు పంపిణీ చేశారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, ఇన్‌చార్జి ఎంపీడీఓ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు వీరంరెడ్డి నాని, నర్ల కొండల రావు, గృహసారథుల మండల కన్వీనర్ ఉటా వాసు, నియోజకవర్గ పార్టీ నాయకులు వినుకొండ విష్ణుచక్రం, నాగనబోయిన రాజబాబు, తలాటం శ్రీనివాసు బావిశెట్టి విష్ణు తదితరులు పాల్గొన్నారు.



నాగులాపల్లి సచివాలయంలో సంక్షేమ, అభివృద్ధి బోర్డును ఆవిష్కరిస్తున్న సర్పంచి గౌరీ రాజేశ్వరి

నాగులపల్లిలో వై ఏపీ నీడ్స్ జగన్

కొత్తపల్లి: నాగులపల్లి గ్రామ సచివాలయం–1లో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సర్పంచ్ వడిశెట్టి గౌరీరాజేశ్వరి గ్రామ సచివాలయంలో అభివృద్ధి, సంక్షేమ బోర్డును ఆమె ఆవిష్కరించారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్ ఆధ్వర్యంలో గృహ సారథులతో కలసి ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. గృహ సారథులకు, సచివాలయ కన్వీనర్లకు పార్టీ సామకూర్చిన కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, నాగులాపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు అబ్బిరెడ్డి రాం చంద్రారెడ్డి, ఎంపీటీసీ అనిశెట్టి సుభాషిణీ, బర్రే రవి, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బండి దావీదు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉత్తమ భవిత



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

పిఠాపురం: విద్యార్థుల భవిష్యత్ విద్యతోనే ఆధారపడి ఉందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పట్టణంలో ఉన్న సీబీఎం పాఠశాలలో బుధవారం విద్యార్థులకు పట్టణ పార్టీ ఉపాధ్యక్షుడు వజ్రపు వీరేష్ ఆధ్వర్యంలో పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యను ప్రోత్సహిస్తూ పాఠశాలలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం అలవర్చుకోవాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పాఠశాలలను ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి తీసుకువెళ్లాయన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

వేణుగోపాల స్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం

పిఠాపురం: పట్టణంలో వేంచేసి ఉన్న వేణుగోపాల స్వామి ఆలయంలో బుధవారం వార్షిక కల్యాణ మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. గురువారం ఆలయం వద్ద మహిళా భక్త సమాజం వారిచే స్వామి కల్యాణ మండప అలంకరణ, రాత్రికి కల్యాణం జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి సీహెచ్‌పీ రమణమూర్తి, అర్చకులు విజయజనార్దన మూర్తి తెలిపారు.

సాగునీటిని సద్వినియోగం చేసుకోండి

- వంతుల నిబంధనలు పాటించాలి
- ఏపీఎస్ఐడీసీ ఈఈ అనురాధ
- ఎత్తిపోతల పథకాల నిర్వాహకుల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఈఈ అనురాధ

సామర్లకోట: ఎత్తిపోతల పథకాల నిర్వాహకులు నిబంధనలు పాటిస్తూ వంతుల వారీగా నీటిని సక్రమంగా వినియోగించుకోవాలని రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ ఈఈ ఎం.అనురాధ అన్నారు. బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జిల్లా పరిధిలోని ఎత్తిపోతల పథకాల నిర్వాహకుల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె క్లిష్ట పరిస్థితుల్లో ఎత్తిపోతల పథకాల నుంచి సాగునీరు ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలిపారు. ప్రతి ఎకరాకు నీరు అందివ్వాలన్న సీఎం జగన్ ఆదేశాల మేరకు విద్యుత్ సరఫరా అందుబాటులో ఉన్న మేరకు పథకాల నుంచి వంతుల వారీగా నీటిని ఇవ్వాలని నిర్ణయించామని, ఇందుకు ఆయా పథకాల నిర్వాహకులు సహకరించాలని కోరారు. రైతులకు మేలు చేయలనేది ప్రభుత్వ ఉద్దేశమని ఐడీసీ డీఈ గురవయ్య అన్నారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు మాట్లాడుతూ సామర్లకోట ప్రధాన పంట కాలువపై ఉన్న వేట్లపాలెం, మేడపాడు, పీబీ దేవం, ఇళ్లపల్లి, బిక్కవోలు, కాపవరం ఎత్తిపోతల పథకాల నిర్వాహకులు సాగునీటిని వృథా కాకుండా వినియోగించుకోవాలన్నారు.

వ్యవసాయశాఖ ఏడీఏ జీవీ పద్మశ్రీ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు డిసెంబరు ఐదు నాటికి నాట్లు పూర్తి చేసి మార్చి 31 నాటికి కోతలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇరిగేషన్ ఏఈ సుజన మాట్లాడుతూ గత ఏడాది ఎత్తిపోతల పథకాల నిర్వాహణలో ఇబ్బందులు వచ్చాయని, ప్రస్తుతం ఆ సమస్య లేకుండా వారానికి మూడు రోజులు మాత్రమే నీరు తిప్పాలన్నారు. సామర్లకోట గోదావరి కాలువ నుంచి పిఠాపురం బ్రాంచి కెనాల్‌కు నీరు అందించాల్సిన బాధ్యత తమపై ఉన్నదని, గోదావరిలో నీటి మట్టం తక్కువగా ఉన్నా ఎత్తిపోతల పథకాలకు వంతుల వారీగా నీరివ్వడం అభినందనీయమని ఉమ్మడి జిల్లా ఎత్తిపోతల సమాఖ్య అధ్యక్షుడు పుట్టా సోమన్న చౌదరి అన్నారు. కలెక్టరు ఆదేశాలను పాటిస్తూ ఏ అధికారికీ ఇబ్బంది లేకుండా చేస్తామని ఆయా పథకాల నిర్వాహకులు హామీ ఇచ్చారు. మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు నిడదవోలు సురేష్‌చౌదరి, పీబీ దేవం సర్పంచ్ నీలపాల సత్యనారాయణ, వ్యవసాయశాఖ ఏఓ ఐ.సత్య, ఏఈఓ ఎంపీ సతీష్, ఎత్తిపోతల సంఘాల అధ్యక్షులు, వ్యవసాయ అనుబంధశాఖ అధికారులు పాల్గొన్నారు.

వర్మా.. బహిరంగ చర్చకు సిద్ధమా..

మండల సచివాలయ కన్వీనర్ జాన్

కొత్తపల్లి: గత ప్రభుత్వంలో తీరప్రాంతంలో జరిగిన అభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలని మాజీ ఎమ్మెల్యే వర్మకు మండల సచివాలయ కన్వీనర్ ఉమ్మిడి జాన్ సవాల్ విసిరారు. మండలంలోని ఉప్పాడలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జాన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో నిర్మిస్తున్న మేజర్ హార్బర్ తీర ప్రాంత మత్స్యకారులకు ఒక వరమన్నారు. దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఈ హార్బర్ నిర్మాణాన్ని ప్రతిపాదనలు సిద్ధం చేశారన్నారు. అయితే తన మృతితో హార్బర్ మంజూరు కాలేదన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలోని హార్బర్‌ను తెచ్చామంటూ మాజీ ఎమ్మెల్యే వర్మ మత్స్యకార గ్రామాల్లో తిరుగుతూ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని మత్స్యకారులు గమనిస్తూనే ఉన్నారన్నారు. గత ప్రభుత్వంలో ఆయిల్ సబ్సిడీని సుమారు 1260 బోట్లకు ఇవ్వడమే కాకుండా రూ.6 ఉన్న దాన్ని రూ.9 పెంచిన ఘనత ముఖ్యమంత్రిదే నన్నారు. వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు భరోసా పథకం కింద రూ.10వేలు, సముద్రంలో ప్రమాదవశాత్తు మత్స్యకారులు మృతి చెందితే రూ.10లక్షలు అందిస్తున్నారన్నారు. గత ప్రభుత్వాల మాదిరిగా మాటల ప్రభుత్వం కాదని, ఇప్పుడున్నది చేతల ప్రభుత్వమన్నారు. గత ప్రభుత్వంలో వర్మ దత్తత తీసుకున్న ఉప్పాడ గ్రామంలో నీ హయంలో అభివృద్ధి ఎక్కడ జరిగిందో చెప్పాలని అన్నారు.

ప్రజ్వలంగా జ్యోతిర్లింగార్చన



పంచారామ క్షేత్రంలో భక్తులు వెలిగించిన దీపాలు

సామర్లకోట: స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర ఆలయంలో బుధవారం జ్యోతిర్లింగార్చన ఆకట్టుకుంది. లక్ష పత్రి పూజలు చేస్తున్న భక్తులకు ఆలయ దీపారాధన సంఘ సభ్యులు జ్యోతిర్లింగార్చనకు ఏర్పాటు చేస్తున్నారు. ధ్వజస్తంభం వద్ద దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు పూజలలో పాల్గొన్ని ఆకాశ దీపం వెలిగించారు. ఈఓ డి. నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ట్రస్టు బోర్డు సభ్యులు సేవలందించారు.

అయ్యప్ప పడిపూజలో..



స్వామివారి పూజ

కొత్తపల్లి: స్థానిక శ్రీధర్మశాస్త్రాలయంలో బుధవారం పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి పంచామృత అభిషేకాలు నిర్వహించి పూలమాలలతో అలంకరించారు. 18 పడి మెట్లను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వాములు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

మహారాణి ఆశయ సాధనకు కృషి చేయాలి



పేదలకు వస్త్రదానం చేస్తున్న చైర్మన్ తులసీ మంగతాయారు, ఎమ్మెల్యే రాజప్ప తదితరులు

ఎమ్మెల్యే చిన రాజప్ప

పెద్దాపురం: రాజా వత్సవాయి బుచ్చి సీతాయ్యమ్మ జగపతి బహదూర్ మహారాణి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప, మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహలక్ష్మి అన్నారు. మహారాణి 188వ వర్ధంతిని బుధవారం మహారాణి సత్రం ఈఓ కాట్నం జగన్మోహన శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 1882లో స్థాపించిన సత్రం దినదినాభివృద్ధి చెంది ఎందరికో మేలు చేసిందన్నారు. ఈఓ శ్రీనివాస్ మాట్లాడుతూ సత్రానికి వెన్నెముక లాంటి కౌలు రైతులు సకాలంలో శిస్తు చెల్లించి సత్రానికి ఆసరాగా ఉంటున్నారన్నారు. 365 రోజులూ రెండు పూటలా భోజన వసతి కల్పిస్తున్న సత్రం ఇదేనన్నారు. తొలుత మహారాణి విగ్రహానికి వారితో పాటు వార్డు కౌన్సిలర్ బొబ్బిలి వీర వెంకట దుర్గ, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ చల్లా ఉదయ్ బాబు నాయుడు నివాళులర్పించారు. అనంతరం పేదలకు వస్త్రదానం, అన్నదానం చేశారు. అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, కౌన్సిలర్లు తృలికి సత్యభాస్కర్, ఆరెళ్ళి వీర్రాఘవులు, విడదాసరి రాజా, కో–ఆప్షన్ సభ్యులు షేక్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



వృద్ధులు, వికలాంగులకు దుప్పట్లు అందజేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: పాతఇసుకపల్లి ఎస్సీపేటలోని ఎంపీపీ పాఠశాలలో బుధవారం గొర్ల వెంకట్రావు, మంగయ్యమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వృద్ధులకు, విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. సంస్థ చైర్మన్ గొర్ల పెద్దిరాజు మాట్లాడుతూ సంస్థ 18వ వార్షికోత్సవం సందర్భంగా 50 మంది వృద్ధులు, విద్యార్థులకు దుప్పట్లను అందజేశామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చింతపల్లి మూలారెడ్డి, యరకం వెంకట సుబ్బిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తడిసిన వరి పనల పరిశీలన



వరిపనలను పరిశీలిస్తున్న ఏఓ సత్యనారాయణ

పిఠాపురం: గొల్లప్రోలు మండలంలో కురిసిన వర్షం కారణంగా గొల్లప్రోలు, చేబ్రోలు, మల్లవరం గ్రామాల్లోని పంట పొలాల్లో తడిసిన వరి పనలను మండల వ్యవసాయ శాఖాధికారి కేవీవీ సత్యనారాయణ బుధవారం పరిశీలించారు. తడిసిన పనల వరిని ఏ విధంగా రక్షించుకోవాలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడిసిన వరి పనల గింజలు మొలకెత్తకుండా వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా ఎద్దుల తరలింపు

పిఠాపురం: కత్తిపూడి జాతీయ రహదారిలో అక్రమంగా తరలిస్తున్న ఎద్దులను పట్టుకున్నట్టు బుధవారం పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. కత్తిపూడి జాతీయ రహదారిలో అక్రమంగా ఎద్దులను తరలిస్తున్నారని సమాచారం రావడంతో ఎస్సై వినయ్‌ప్రతాప్ తన సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. విశాఖ నుంచి రాజమండ్రి వైపు వెళతున్న వ్యాన్‌లో తరలిస్తున్న 9 ఎద్దులను స్వాధీనం చేసుకుని వాహనాన్ని సీజ్ చేసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

తల్లీబిడ్డల ఆరోగ్యమే లక్ష్యం

- షెడ్యూల్ ప్రకారం అందించాల్సిన వైద్యంపై ఆస్పత్రుల్లో ఎంసీపీ కార్డులు
- వైద్య, ఆరోగ్యశాఖలో నూతన విధానాలకు నాంది పలికిన ప్రభుత్వం



గర్భిణులకు ప్రభుత్వం జారీ చేసిన ఎంసీపీ కార్డు



ఆర్‌బీ కొత్తూరులో శిశువుకు టీకా వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

పెద్దాపురం: మాతా, శిశు మరణాలు నివారణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వైద్య, ఆరోగ్య శాఖలో సమూల మార్పులకు నాంది పలికింది. అన్ని పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా ఆసుపత్రుల్లో పూర్తి స్థాయిలో సిబ్బంది నియామకంతో పాటు నిర్ణీత సమయాల్లో టీకాలు వేయడం, మందుల కొరత లేకుండా చర్యలు, సుఖ ప్రసవాలకు చర్యలు చేపట్టింది. గర్భం దాల్చినప్పటి నుంచి బిడ్డ పుట్టేవరకు తదనంతరం బాలింతగా, బిడ్డ సంరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలతో కూడిన ఎంసీపీ కార్డులను ముద్రించింది. ఆ షెడ్యూల్ ప్రకారం చర్యలు తీసుకునేలా పీహెచ్‌సీలలో క్షేత్రస్థాయి సిబ్బందికి వాటిని అందజేసింది. అలాగే ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష యోజన, జననీ సురక్ష యోజన, ప్రధాని మాతృత్వ వందన యోజన, ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగిన ప్రసవానికి ఆర్థిక సాయం వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోంది.

శిశువులకు టీకాలే శ్రీరామ రక్ష..

అప్పుడే జన్మించిన శిశువు నుంచి ఐదేళ్ల లోపు చిన్నారుల వరకూ సాధారణంగా వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. దీంతో చిన్నారుల ఇన్‌ఫెక్షన్ సోకి అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉంది. నిర్ణీత సమయంలో టీకాలు వేసేలా ఎంసీపీ కార్డుల్లో షెడ్యూల్ రూపొందించారు. ఏదైనా ఇబ్బంది వచ్చి నిర్ణీత తేదీ నాడు టీకా వేయకుంటే ఆరోగ్య సిబ్బందే ముందస్తు సమాచారం ఇచ్చి బిడ్డకు టీకా వేస్తారు.



అవగాహన పెంచుతున్నాం

రాష్ట్ర ప్రభుత్వం చిన్నారులు, గర్భిణుల ఆరోగ్య రక్షణ కోసం ప్రవేశపెట్టిన ఎంసీపీ కార్డులు సద్వినియోగం చేసుకోవడంపై వారికి అవగాహన కల్పిస్తున్నాం. ఎంసీపీ కార్డు ద్వారా గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం జరిగే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, శిశువుకు సకాలంలో అందించాల్సిన టీకాలపై తల్లులకు వివరిస్తున్నాం.

– ఎం.ఉషా ప్రియదర్శిని, కాండ్రకోట పీహెచ్‌సీ వైద్యాధికారి, పెద్దాపురం మండలం

విద్యకు తగిన ఉపాధి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పదో తరగతి ఆపై చదివిన వారు ఉపాధి కార్యాలయంలో నమోదు చేసుకుంటే అవసరాన్ని బట్టి క్రమ సంఖ్యలో సీనియారిటీ మేరకు ఉద్యోగావకాశాలకు కాల్ లెటర్లు పంపేవారు. అది కూడా ప్రభుత్వోద్యోగాలకు మాత్రమే. ఇదంతా గతం. నేడు ప్రైవేటు సంస్థలు పెరగడంతో నిపుణ్యం ఉన్నవారికి అవకాశాలు మెండుగా వస్తున్నాయి. ఉపాధి కల్పన కార్యాలయాలను కేంద్ర ప్రభుత్వం ఇటీవలే మోడల్ కెరీర్ సెంటర్ (ఎంసీసీ)గా తీర్చిదిద్ది జాబ్‌మేళాల నిర్వహణతో పాటు పలు ప్రత్యేకమైన ఉద్యోగాల కోసం శిక్షణ కూడా ఇస్తున్నారు. ఇప్పటికే ఎంసీసీలను డిజిటలైజ్ చేశారు. స్థానిక ఐటీఐ ప్రాంగణంలో ఉన్న ఉపాధి కార్యాలయంలో దీనిని ఏర్పాటు చేశారు.

ఈ కేంద్రాల ఏర్పాటులో భాగంగా కొన్ని నెలల కిందట కేంద్ర ప్రభుత్వం ఎన్‌సీఎస్ (నేషనల్ కెరియర్ సర్వీస్) పేరిట జాతీయ వెబ్‌పోర్టల్ ప్రారంభించింది. దీనిపై కళాశాలలు, పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ పోర్టల్‌లో జాబ్‌సీకర్‌గా కనీస విద్యార్హత 7వ తరగతి ఆపై చదివిన వారి వివరాలు నమోదు చేస్తారు. ప్రస్తుతానికి కార్యాలయ సిబ్బంది ఆధ్వర్యంలో నమోదు పక్రియ చేస్తున్నారు. విద్యార్థి స్వయంగా చేసుకోవాలంటే ఎన్‌సీసీ యూజర్ ఐడీ పాస్‌వర్డ్ క్రియేట్ చేసుకుని సమగ్ర వివరాలు అప్‌లోడ్ చేసుకోవచ్చు. ఇప్పటికే పది, ఇంటర్‌మీడియట్, డిగ్రీ, ఐటీఐ, పీజీ, ఎంబీఏ, ఏంసీఏ డిప్లమో చేసిన వారు నమోదు చేసుకున్నారు.

ప్రతి విద్యార్థికి డిజిటల్ కార్డు..

ఉపాధి కల్పనశాఖలో ఇప్పటి వరకూ వివరాలు నమోదు చేసుకున్న వారికి గుర్తింపు సంఖ్యతో పాటు ధ్రువపత్రం ఇచ్చేవారు. ఇకపై ఎంసీసీ విధానంలో వాటి స్థానంలో గవర్నమెంట్ ఆఫ్ ఇండియా పేరుతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా ఒక నెంబరుతో కూడిన డిజిటైజ్డ్ కార్డు జారీ చేస్తారు. దీని ద్వారా అభ్యర్థి వివరాలు ప్రతి ఏడాది సవరించుకోవాలి. ఇలా నమోదు చేసుకున్న వారి వివరాలు కేంద్రం నేరుగా పరిశీలించి అభ్యర్థి ప్రతిభ ఆధారంగా ప్రభుత్వ, ప్రైవేట్ కొలువుల మేళాలకు ఎంపిక చేస్తుంది.

ఐటీ ల్యాబ్ ఏర్పాటు..

ఎంసీసీలో దాదాపు 10 కంప్యూటర్లతో ఐటీ ల్యాబ్ ఏర్పాటు చేశారు. ఐటీ సాంకేతిక నిపుణులు విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చి సైక్రోమెటిక్ అనే పరీక్ష నిర్వహించి దీని ద్వారా వారి శక్తి సామర్థ్యాలు గుర్తించి వారికి ఏ శిక్షణ ఇవ్వాలి, ఏ విధంగా ఉపాధి కల్పించాలి లేదా స్వయం ఉపాధికి ప్రోత్సహించాలి వంటి విషయాలపై అవగాహన కల్పిస్తున్నారు. కొలువులే గాకుండా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషిచేస్తున్నారు.